క్లుప్తంగా

ఉప్పాడ తీరంలో 'అల'జడి



ఉప్పాడ తీరంలో ఎగసి పడుతున్న అలలు

కొత్తపల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో సముద్రతీరంలో అలల ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి. ఉదయం నుంచి ఎడతెరిపివ్వకుండా కురుస్తున్న వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. వాహనదారులు, ప్రయాణికులు, కూలీలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉప్పాడ బీచ్‌రోడ్డు సెంటర్‌లో ఇరువైపులా ఉన్న డ్రైన్లను ఆక్రమించి షాపులను ఏర్పాటు చేయడంతో వర్షపు నీరు పోయేందుకు వీలులేక నీరంతా నిలిచిపోయి చెరువును తలపిస్తోంది. కురుస్తున్న వర్షం కారణంగా చిరువ్యాపారులు, తోపుడుబండ్లు వ్యాపారులు ఇబ్బందులు గురయ్యారు.

క్రైస్తవులపై దాడులు అమానుషం

పెద్దాపురం: మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులు అమానుషమని జిల్లా క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షుడు రెవరెండ్ డాక్టర్ జోషువా గిరి అన్నారు. మండలంలోని వడ్లమూరు గ్రామంలో మంగళవారం సాయంత్రం పెద్దాపురం నియోజకవర్గ క్రిస్టియన్ పాస్టర్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.మోజెస్ అభిషేక్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. జార్జి శ్రీమంతుల, టి.బ్లెస్సింగ్, ఎంఎ జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

దోష రహితంగా ఓటర్ల జాబితా



ఓటర్ల జాబితా సవరణపై శిక్షణ ఇస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

కరప: బీఎల్‌ఓలు తమ పరిధిలోని ఓటర్ల జాబితాలో ఏమైనా తప్పులున్నా, మార్పులు, చేర్పులున్నా సరిచేసి దోష రహితంగా రూపొందించాలని తహసీల్దార్ పి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం సాయంత్రం బీఎల్‌ఓలు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బందితో ఏర్పాటుచేసిన సమావేశంలో ఓటర్ల జాబితా సవరణపై అనుసరించాల్సిన విధివిధానాలపై అవగాహన కల్పించారు. అర్హులైనవారు ఉంటే కొత్త ఓటర్లగా నమోదుచేయాలన్నారు. ఈనెల 21వ తేదీ నుంచి ఆగస్టు 20వ తేదీ వరకు ఇంటింటి సర్వే నిర్వహించి, ఎవరైనా మరణించినా, గ్రామాంతరం వెళ్లినా, చిరునామా మారినా, పేర్లలో తప్పొప్పులుంటే నిర్దేశించిన పత్రాల్లో పూర్తిచేసి, దరఖాస్తు చేయించాలన్నారు. ఆర్‌ఐ పేపకాయల మాచర్రావు తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అభయాంజనేయస్వామి

బోట్‌క్లబ్: అధిక శ్రావణ మాసం దక్షిణాయనం మొదటిరోజు మంగళవారం సందర్భంగా స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభయాంజనేయస్వామికి విశేష తమలపాకులు, గంధ సింధూర పూజ జరిగాయి. 300 మంది భక్తులతో పదకొండు సార్లు హనుమాన్ చాలీసా పారాయణ నిర్వహించారు. అయోధ్య రామ పాదుకలు తీసుకువచ్చి భక్తులు సందర్శనార్థం ఆలయంలో ఉంచారు. ఆలయ ఈఓ బీవీఆర్ చౌదరి దంపతులు ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పులవర్తి సీతారామకృష్ణ, ముత్తా మధు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేస్తున్న మాజీ సర్పంచ్ తాతీలు

కరప: గ్రామశివారు రామకంచిరాజునగర్, నక్కావారి ఎస్సీ వీధిలోని మండల ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు మంగళవారం మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు నోట్‌పుస్తకాలు అందజేశారు. కాకినాడలోని ఆనందభారతి హైస్కూలు పూర్వవిద్యార్థులు సమకూర్చిన నోట్ పుస్తకాలను విద్యార్థులకు ఇచ్చినట్టు మాజీ సర్పంచ్ తెలిపారు.

కోనేటి పనులు ఎన్నాళ్లు?

- పూడిక తీతలో సాగతీత
- నాలుగు నెలలుగా ఇదే తంతు
- నిజ శ్రావణానికైనా పూర్తయ్యేనా అని ప్రశ్నిస్తున్న భక్తులు



ఆలయ కోనేటిలో నిలచిన పనులు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలా త్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వర స్వామి ఆలయ కోనేరు పనులు నత్తనడకన సాగుతున్నాయి. కోనేరులో పూడిక తీత పనులు ప్రారంభించి నాలుగు నెలలు కావస్తున్నా నేటికీ పూర్తికాలేదు. పూడిక తీసి ఇసుకతో నింపాల్సి ఉన్నా గ్రావెల్ వేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. శ్రావణ మాసం ప్రారంభం కావడంతో ఆలయానికి భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఈ పనుల వల్ల కోనేటిలోని శివ లింగానికి అభిషేకం చేసుకునే అవకాశం లేకుండా పోయిందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక వర్షాకాలంలో ఈ పనులను ఇంకెంత కాలం సాగదీస్తారో అని వారు అంటున్నారు.

వరలక్ష్మీ వ్రతాలకు సర్వం సిద్ధం

శ్రావణ మాసంలో ప్రతి శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఆలయంలో జరుగుతాయి. రెండో శుక్రవారం మినహా మిగిలిన మూడు శుక్రవారాలు దేవస్థానం భక్తులకు ఉచితంగా పూజా సామగ్రి అందజేస్తుంది. ప్రతి శుక్రవారం సుమారు 400 నుంచి 600 వరకు సామూహిక వ్రతాల్లో పాల్గొనే అవకాశం ఉంటుంది. పురావస్తు శాఖ అధికారులు నిర్లక్ష్యంపై ట్రస్టు బోర్డు సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఈఓ ద్వారా ఫిర్యాదు చేశాం



కోనేటి పనుల్లో జాప్యంపై ఈఓ ద్వారా పురావస్తుశాఖ అధికారులకు ఫిర్యాదు చేశాం. శ్రావణ మాసం అధిక మాసం రావడంతో వరలక్ష్మీ వ్రతం పూజలకు మరో నెల రోజుల సమయం ఉంటుంది. శ్రావణ మాసం ఏర్పాట్లపై ట్రస్టుబోర్డు సమావేశం నిర్వహించి చర్యలు తీసుకుంటాం.

– యండమూరి వెంకటసుబ్బారావు, ట్రస్టు బోర్డు సభ్యుడు, సామర్లకోట

వారంలో పూర్తి అవుతాయి



ఆలయ కోనేరులో పురావస్తు శాఖ ఆధ్వర్యంలో పూడిక తీత పూర్తి చేశారు. దిగువ భాగాన్ని కంకరతో నింపాల్సి ఉంది. కంకర వేసిన తరువాత రోలింగ్ చేసి దానిపై ఇసుక వేయాలి. ఈ పనులు పూర్తయ్యాక కోనేటిని గోదావరి నీటితో నింపుతాం. వచ్చేనెల 18 నుంచి శ్రావణ మాసం వరలక్ష్మీ పూజలు ఉంటాయి..

–డి.నాగమల్లేశ్వరరావు, పంచారామ క్షేత్ర ఈఓ, సామర్లకోట

ఎన్నికలకు ఓటర్ల జాబితా అత్యంత కీలకం



బీఎల్‌ఓల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ సీతారామారావు



సమావేశానికి హాజరైన బీఎల్‌ఓలు

- సర్వే ప్రారంభించని బీఎల్‌ఓలపై ఆర్డీఓ సీతారామారావు అసంతృప్తి
- నిర్లక్ష్యానికి మూల్యం తప్పదని హెచ్చరిక

సామర్లకోట: బీఎల్‌ఓల పనితీరుపై ఆర్డీఓ జె.సీతారామారావు అసంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం మండల పరిధిలోని బీఎల్‌ఓలతో స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో సమావేశం నిర్వహించారు. రూరల్ పరిధిలోని జి.మేడపాడు, వేట్లపాలెం, పీబీ దేవం గ్రామాలకు చెందిన బీఎల్‌ఓలు అసలు పని చేయక పోవడం వల్ల నియోజకవర్గానికి చెడ్డపేరు వస్తుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రక్రియలో ఓటరు జాబితా అత్యంత కీలకమైన అంశమని దానిని సక్రమంగా తయారు చేయాలని అన్నారు. ఈ మేరకు బీఎల్‌ఓలు తమ తమ పరిధిలో ఉన్న ఓటర్ల ఇంటింటికి వెళ్లి సర్వే చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు చాలా మంది సర్వే ప్రారంభించలేదన్నారు. ఎన్నికలకు సంబంధించి పని చేయని వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు ఉద్యోగాలు కూడా పోయే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. దీనిని దృష్టిలో ఉంచుకొని సర్వేలను వేగంగా, సక్రమంగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి, ఎంపీడీఓ డి.శ్రీలలిత, డిప్యూటీ తహసీల్దార్ ఆర్.శ్రీనివాసరావు, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ పవన్, ఈఓ పీఆర్డీ కర్రి హరికృష్ణ సత్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విధుల బహిష్కరణ



పిఠాపురంలో ఆందోళన నిర్వహిస్తున్న న్యాయవాదులు

పిఠాపురం: అవనిగడ్డ బార్ అసోసియేషన్ కార్యదర్శి జి.శ్రీనివాసరావుపై దాడికి నిరసనగా స్థానిక బార్ అసోసియేషన్ న్యాయవాదులు మంగళవారం విధులు బహిష్కరించారు. పిఠాపురం కోర్టుల ఆవరణలో పిఠాపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లాయర్‌పై పాల్పడిన దుండగులను శిక్షించాలని కోరుతూ ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రాజారావు మాట్లాడుతూ అవనిగడ్డ బార్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాసరావుపై దాడిని ఖండించారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. న్యాయవాదులకు తగిన రక్షణ కల్పించాలని ఆలిండియా లాయర్స్ యూనియన్ పిఠాపురం యూనిట్ ప్రధాన కార్యదర్శి జీఎస్ భాస్కరాచార్యులు కోరారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం బార్ అసోసియేషన్ న్యాయవాదులు ఎస్ఎం ఆలీ, బొల్లోజు రాజా, వీవీ నగేష్, సూరవరపు వెంకటేశ్వరరావు, కొంజర్ల అప్పారావు, యేసురత్నం తదితరులు పాల్గొన్నారు.

బిందు, తుంపర సేద్యంపై దృష్టి పెట్టాలి

- ఏపీఎంఐపీ జిల్లా అధికారి వరప్రసాద్
- రైతులకు అవగాహన సదస్సు



శిక్షణ సదస్సులో మాట్లాడుతున్న వర ప్రసాద్

పెద్దాపురం: మెట్ట ప్రాంత రైతులు బిందు, తుంపర సేద్యంపై దృష్టి సారించి ఆర్థికాభివృద్ధి సాధించే దిశగా సిబ్బంది చర్యలు చేపట్టాలని ఏపీఎంఐపీ జిల్లా అధికారి జీవీవీ వరప్రసాద్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండలంలోని ఆయా గ్రామాల వీహెచ్‌ఏలతో తుంపర సేద్యం, రైతుల సబ్సిడీ రాయితీలపై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. మండల ఉద్యాన శాఖాధికారి ఎస్.సుజాత అధ్యక్షతన జరిగిన సదస్సులో వరప్రసాద్ మాట్లాడుతూ బిందుసేద్యం ద్వారా ఎరువుల వాడకంపై రైతులు మరింత అవగాహన ఏర్పరచుకోవాలన్నారు. అన్ని మొక్కలకు ఎరువును సమానంగా అందించి రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కూలీల ఖర్చును తగ్గించుకుని అధిక దిగుబడులు సాధించే అవకాశం బిందుసేద్యంతోనే సాధ్యపడుతుందన్నారు. అనంతరం ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సబ్సిడీ, రాయితీలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ దైవ కుమార్, ఆయా గ్రామాల వీహెచ్‌ఏలు పాల్గొన్నారు.

సమాజ హితం కోసమే వేదస్వస్తి



వేదస్వస్తి నిర్వహిస్తున్న వేదపండితులు

బోట్‌క్లబ్: సమాజంలో అన్ని వర్గాల ప్రజలు సుఖశాంతులతో జీవించాలన్న ప్రధాన ఆశయంతో కాకినాడ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రతి నెలా వేద స్వస్తి నిర్వహిస్తున్నట్లు సంఘ ప్రధాన కార్యదర్శి ముంజులూరి విశ్వేశ్వరరావు అన్నారు. స్థానిక సర్పవరం జంక్షన్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం వేద స్వస్తి ప్రారంభించారు. వేద స్వస్తి ద్వారా సమాజ హితంతో పాటు ఆధ్యాత్మిక వాతావరణం పెంపొందుతుందన్నారు. సంఘ కన్వీనర్ భగవతి మహాశయ మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని సంఘ అధ్యక్షులు అజ్జరపు సత్యనారాయణ మూర్తి సౌజన్యంతో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వేద పండితులు కప్పగంతుల చంద్రశేఖర శాస్త్రి, కొంపెల్ల వీరభద్ర ప్రకాశం, కందాళ సుబ్రహ్మణ్యం, బులుసు అయ్యప్ప, తేజోమూర్తుల సంతోషి, మూడుగుల పవన్, కపిలవాయి సురేంద్రతో పాటు పలువురు పండితులు సుమారు రెండుగంటల పాటు వేదఘోష వినిపించారు.

వచ్చే నెలలో విశ్వరూపం మహాసభ



కాకినాడ, అమలాపురం ఇన్‌చార్జిలుగా బాధ్యతలు స్వీకరించి జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న రామకృష్ణ సత్తిబాబు తదితరులు

కాకినాడ సిటీ: ఆగస్టు రెండో వారం హైదరాబాదులో విశ్వరూపం మహాజన సభ నిర్వహిస్తున్నట్లు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, ఎంఎస్‌పి జిల్లా ఇన్‌చార్జి శెట్టే రామకృష్ణ మాదిగ, అమలాపురం జిల్లా అధ్యక్షులు వల్లూరి సత్తిబాబు, కాకినాడ నియోజకవర్గం కన్వీనర్ పలివెల నవీన్‌మాదిగ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమీపంలోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి వారు నివాళులర్పించారు. అనంతరం వీరు ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణమాదిగ పిలుపు మేరకు చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా ఇన్‌చార్జిగా నియమితులైన పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన శెట్టే రామకృష్ణ కాకినాడ నియోజకవర్గ ఇన్‌చార్జి పలివెల నవీన్ ఆధ్వర్యం ఎమ్మార్పీస్ నాయకుల సమక్షంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు.

ఖరీఫ్ సాగుతూ..



నాగులాపల్లిలో బెంగాలీ కూలీలతో ఊడ్పు



వరి నాట్లు వేసేందుకు పట్టి(చదును) తోలుతున్న రైతు



నాట్లకు సిద్ధంగా ఉన్న నారుమడి

- సాగు పనుల్లో నిమగ్నమైన రైతులు
- నియోజకవర్గంలో 12,087 హెక్టార్‌లో సాగు

కొత్తపల్లి: ఖరీఫ్ సాగు ముమ్మరంగా సాగుతోంది. రైతులు పనుల్లో నిమగ్నమయ్యారు. అడపాదడపా కురుస్తున్న వర్షాలకు పొలంలో నీరుచేరడంతో దమ్ము పనులు జోరుగా జరుగుతున్నాయి. కూలీలతో నాట్లు వేస్తున్నారు. ప్రస్తుత ఎక్కువగా వెదజల్లు, బెంగాలీ ఊడ్పు విధానంలో నాట్లు వేస్తున్నారు. ఏళ్ల తరబడి ఆలవాటుగా వస్తున్న వరి నాట్ల విధానానికి బదులు వెదజల్లు విధానాన్ని రైతులు ఎంచుకున్నారు. పిఠాపురం నియోజకవర్గంలో ఈ ఏడాది 12,087 హెక్టార్లో రైతులు వరిసాగు చేస్తున్నారు. కొత్తపల్లి మండలంలో 6167 మంది రైతులు 10,264ఎకరాల్లో సాగు చేస్తున్నారని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు.

వెదజల్లు, బెంగాలీ ఊడ్పులకే ప్రాధాన్యత



రైతులు ఖర్చును, కూలీల కొరతను నియంత్రించేందుకు అధిక శాతం రైతులు వెదజల్లు, బెంగాలీ ఊడ్పుకే ప్రాధాన్యత ఇస్తున్నారు. వీటి ద్వారా వెదజల్లుకు ఎకరానికి 12 కేజీల విత్తనాలు, బెంగాలీ ఊడ్పుకు 5 కేజీల విత్తనాలు అవసరమవుతుందన్నారు. వీటి ద్వారా అధిక పంట దిగుబడి వచ్చే అవకాశం ఎక్కువగా ఉండడంతో మండలంలో ఎక్కువ శాతం మంది రైతులు వీటికే ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇప్పటికే మండలంలో నాగులాపల్లి, ఎండపల్లిలో ప్రారంభమయ్యాయి. రైతు భరోసా కేంద్రాలలో రైతులకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉన్నాయి.

– వి.జోగిరాజు, వ్యవసాయాధికారి, కొత్తపల్లి మండలం

వలంటీర్లకు వందనం

పథకాలు వివరిస్తూ.. అందజేస్తూ..



చెవ్వేటి రాజులమ్మకు కులధ్రువీకరణ పత్రం అందజేసిన వలంటీరు గ్రంధి నాగజ్యోతి

మున్సిపాలిటీ పరిధిలోని ఆరో సచివాలయానికి చెందిన భీమవరం–2 వలంటీరు గ్రంధి నాగజ్యోతి నిత్యం ఇంటికి వచ్చి తమ అవసరాలు తెలుసుకుంటారు. జగనన్న సురక్షలో ఉచితంగా సర్టిఫికేట్లు ఇవ్వడంతో చేయూత పథకానికి సంబంధించి కుల ధ్రువీకరణ పత్రానికి దరఖాస్తు చేసి లబ్ధి చేకూరుస్తున్నారు. ఇప్పటికే వితంతు పింఛను రావడానికి వలంటీరు కృషి చేశారు. గత మూడేళ్లుగా చేయూత పథకాన్ని చెవ్వేటి రాజులమ్మ అందుకుంటున్నారు.

తిరిగే పని తప్పింది



ప్రతి నెల పింఛను కోసం వార్డులోని పాఠశాల వద్ద గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చేది. తెల్లవారు జామునే వలంటీర్ ఇంటికి వితంతు పింఛను తీసుకు వచ్చి ఇస్తున్నారు. చేయూత పథకం గురించి వివరించి ఆ పథకం అందేలా సాయం చేస్తున్నారు. మూడేళ్లుగా పథకం సొమ్ము బ్యాంకు ఖాతాలో జమ అవుతోంది. ఈ పథకానికి కావలసిన సర్టిఫికెట్లు ప్రస్తుతం జగనన్న సురక్షలో ఉచితంగా పొందడానికి నాగజ్యోతి తమ చేత దరఖాస్తు చేయించి ఇంటికి తీసుకువచ్చి అందజేశారు.

– చెవ్వేటి రాజులమ్మ, లబ్ధిదారు, సామర్లకోట.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

పంచాయతీ కార్యదర్శుల సదస్సులో ఎంపీడీఓ



సామర్లకోట పంచాయతీ కార్యదర్శుల సదస్సులో మాట్లాడుతున్న ఎంపీడీఓ

సామర్లకోట: పారిశుధ్య పనులపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ డి.శ్రీలలిత అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన వర్క్‌షాపులో ఆమె పాల్గొన్నారు. ప్రస్తుత వర్షాకాల సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని తరుచూ డ్రైన్లను శుభ్రం చేయడంతో పాటు బ్లీచింగ్ పిచికారి చేయాలన్నారు. తాగునీటి ట్యాంకులను తరుచూ శుభ్రం చేయాలని సూచించారు. రోడ్లపై చెత్త లేకుండా తడిచెత్త, పొడి చెత్త సేకరించడంతో పాటు వర్మీ కంపోస్టు యూనిట్ల నిర్వాహణ సక్రమంగా జరిగేలా చూడాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల వద్ద ప్రత్యేక పారిశుధ్య నిర్వాహణ ఉండాలన్నారు. ఈఓ పీఆర్డీ కర్రి హరికృష్ణ సత్యారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పద్మరూప తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతు కార్డులతో పంట రుణాలు

జిల్లా వ్యవసాయ శాఖాధికారి విజయకుమార్



కౌలు రైతు కార్డులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖాధికారి విజయకుమార్

పిఠాపురం: కౌలు రైతు కార్డులు పొందిన రైతులకు బ్యాంకుల ద్వారా పంట రుణాలు అందించేలా బ్యాంకుల అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటున్నట్టు జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎన్.విజయకుమార్ తెలిపారు. ఆయన మంగళవారం పి.రామవరంలో పర్యటించారు. స్థానిక యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను సందర్శించి కౌలు రైతు కార్డులు పొందిన కౌలు రైతులకు తగిన విధంగా రుణాలు మంజూరు చేయాలని బ్యాంకు అధికారులను కోరారు. స్కిల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం ఎకరానికి రూ.30 వేల వరకూ రుణాలు మంజూరు చేయాలని కోరారు. అనంతరం ఆయన రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించి గ్రామ పరిధి/ లో కౌలు రైతులను గుర్తించి వారికి కౌలు రైతు కార్డులు ఇవ్వాలని వీఏఏలకు సూచించారు. కౌలు రైతు కార్డులు పొందిన కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయడానికి వీలుగా డాక్యుమెంటేషన్ చేసి బ్యాంకులకు అందజేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం వ్యవసాయ శాఖ ఏడీఏ పి.స్వాతి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష సర్టిఫికెట్ల అందజేత



వేట్లపాలెం జగనన్న సురక్షలో సర్టిఫికెట్లు అందజేస్తున్న నాయకులు, అధికారులు

సామర్లకోట: మండల పరిధిలో వేట్లపాలెం మూడో సచివాలయం పరిధిలో మంగళవారం జగనన్న సురక్ష నిర్వహించారు. దరఖాస్తుదారులకు 453 సర్టిఫికేట్లు అందజేసినట్టు ఎంపీడీఓ డి.శ్రీలలిత తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రాజ్‌కుమార్, ఈఓ పీఆర్డీ కర్రి హరికృష్ణ సత్యారెడ్డి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు వల్లూరి వీర్రాజు చౌదరి, పంచాయతీ కార్యదర్శి మోషే తదితరులు పాల్గొన్నారు.



కొండెవరంలో ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న దృశ్యం

జగనన్న సురక్షతో ఉచిత సేవలు

కొత్తపల్లి: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు ఉచితంగా ప్రభుత్వ సేవలు లభిస్తున్నాయని ఎంపీడీఓ అబ్రహం లింకన్ అన్నారు. కొండెవరం గ్రామ సచివాలయం–1లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన లబ్ధిదారులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దుళ్ల సత్తిబాబు, డిపూటి తహసీల్దారు జీవీఎస్ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, గ్రామ సచివాలయ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

చిరు వర్తకులకు జగనన్న తోడు



మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలిస్తున్న వైస్ చైర్మన్

పెద్దాపురం: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చిరు వ్యాపారులకు ఆర్థిక భరోసా కల్పించే దిశగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న తోడు పథకం ప్రవేశపెట్టారని మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి అన్నారు. జగనన్నతోడు పథకం ప్రారంభోత్సవంలో భాగంగా మంగళవారం మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర అధ్యక్షతన జరిగిన సమావేశంలో చైర్మన్, వైస్ చైర్మన్‌లు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. మహిళలు సైతం వ్యాపారాభివృద్ధి సాధించాలంటే అల్లికలు, చేతి వృత్తి పనులు, వంటకాలకు అవసరమైన ఆర్థిక సాయం అందించేందుకు జగనన్న తోడు పథకం తోడ్పడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు, కౌన్సిలర్లు ఆరెళ్లి వీర్రాఘవులు, కో–ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, చింతా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తెలుగు కీర్తి ఎస్వీ రంగారావు : ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: విశ్వ విఖ్యాతంగా పేరున్న మహా నటుడు, తెలుగు కీర్తి ఎస్వీ రంగారావు అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. 49వ డివిజన్ నాగమల్లితోట జంక్షన్ వద్ద ఎస్వీఆర్ స్మారక సమితి అధ్యక్షుడు, రూరల్ నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం ఎస్వీఆర్ 49వ వర్ధంతిని నిర్వహించారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, ఎస్వీఆర్ మనుమడు రంగారావు, తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని ఆ మహానటుడి కాంస్య విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కన్నబాబు మాట్లాడుతూ తెలుగుజాతికి ఎస్వీఆర్ కీర్తి తెచ్చారని, నటనకు ఆయన నిఘంటువులాంటి వారని అన్నారు. ఎస్వీఆర్ తెలుగు వారు కావడమే కాకుండా, కాకినాడతో ప్రత్యేక అనుభందం కలిగి ఉన్నారన్నారు. కాకినాడలో విగ్రహం ఏర్పాటు చేసినప్పటి నుంచి జయంతి, వర్ధంతిని నిర్వహిస్తూ పేద కళాకారులకు సహాయం అందిస్తున్నామన్నారు. ఎస్వీఆర్ మనుమడు రంగారావు మాట్లాడుతూ తాతయ్య వర్ధంతిని ఇంత ఘనంగా చేయడం సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, కురసాల సత్యనారాయణలకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. కురసాల సత్యనారాయణ మాట్లాడుతూ తెలుగు జాతి ఉన్నంత వరకు మరవలేని గొప్ప ఎస్వీఆర్ అన్నారు. స్మారక సమితి ఉపాధ్యక్షుడు బసవా ప్రభాకరరావు, ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, ఐ.శ్రీను, రాష్ట్ర సివిల్ సప్లైస్ డైరెక్టర్ జమ్మలమడక నాగమణి, రావూరి వెంకటేశ్వరరావు, శెట్టి బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ అనుసూరి ప్రభాకర్, రాజారపు కృష్ణ, కొలగాని దుర్గా ప్రసాద్, అనిశెట్టి రామకృష్ణ, బలగం ప్రసన్న కుమార్, నేమాం సర్పంచ్ రామదేవు చిన్నా, కడియాల చిన్నా, కురసాల కన్నబాబు యూత్ సభ్యులు పాల్గొన్నారు.